క్లుప్తంగా

ధూర్జటి కవితా మాధుర్యంపై 28న ఉపన్యాసం

నెల్లూరు(బృందావనం): ధూర్జటి కవితా మాధుర్యంపై నగరంలోని పురమందిర ప్రాంగణంలో గల వర్ధమాన సమాజ హాల్లో ఉపన్యాసాన్ని ఈ నెల 28న నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, శేషగిరీశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ గిరిజాలక్ష్మి ఉపన్యసించనున్నారని, కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ ప్రకటించారు. సంతపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నేతలు జియా, అజీజ్ అహ్మద్, షానవాజ్, మున్నా, మౌలానా అజీజ్, సర్దార్, మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో సామూహిక లక్ష కుంకుమార్చన



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మూడు శుక్రవారాల్లో సామూహిక లక్ష కుంకుమార్చనను నిర్వహించనున్నామని దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడారు. భక్తులు రూ.600ను దేవస్థానంలో చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయాధికారి హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి గెస్ట్, పార్ట్‌టైమ్ టీచర్లను నియమించాలని నిర్ణయించామని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు ఇంగ్లిష్‌లో బోధించేందుకు కొత్తకోడూరులోని గురుకుల పాఠశాలలో ఈ నెల 29వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించే డెమో కార్యక్రమానికి ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. బుచ్చిరెడ్డిపాళెం గురుకుల పాఠశాలలో జేఎల్ ఫిజిక్స్, పీజీటీ సోషల్, పెద్దపవనిలో జేఎల్ కెమిస్ట్రీ, టీజీటీ జీవశాస్త్రం, కోడూరు పాఠశాలలో టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఫిజికల్ సైన్స్, కండలేరు పాఠశాలలో పీజీటీ మ్యాథ్స్, టీజీటీ ఫిజికల్ సైన్స్, ఆదూరుపల్లిలో టీజీటీ జీవశాస్త్రంలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీగా ఉన్నాయని వివరించారు.

పలు కళాశాలలపై చర్యలకు డిమాండ్

వెంకటాచలం : నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకుటూరులోని వీఎస్‌యూలో ఇన్‌చార్జి వీసీ సారంగం విజయ్‌భాస్కర్‌రావుకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కొడవలూరు : ఆధార్ ప్రత్యేక శిబిరం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కచ్చితమైన వివరాలతో ఆధార్ ఉండడం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. ఇప్పటికీ ఆధార్ చేయించుకోని వారుంటే వెంటనే నమోదు చేసుకోవాలని చెప్పారు. ఎవరికైనా ఆధార్‌లో అక్షర దోషాలు, తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ఆధార్‌లో ఎలాంటి తప్పులు, తడకలు లేకుండా సరి చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీడీఓ వెంట ఎంఈఓ జి.వసంతకుమారి, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, మండల రిసోర్స్ కో–ఆర్డినేటర్ వి.మనోజ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జి.రాధాకృష్ణ, అంకమరాణి ఉన్నారు.

డైట్ కళాశాలలో శిక్షా సప్తాహ్

ఇందుకూరుపేట : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లిపాడులో ఉన్న డైట్ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఛాత్రోపాధ్యాయులు వివిధ ప్రాంతాల ప్రజల వస్త్రధారణలతో ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేలా కార్యక్రమాలను జరిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, విజయ్‌చంద్ర పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి



సమావేశాన్ని నిర్వహిస్తున్న సూర్యతేజ

• కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్నుల వసూళ్లకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ ఇప్పటి వరకు 26 శాతం మేర పన్నులనే వసూలు చేశారని చెప్పారు. పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, చెల్లించని వాణిజ్య భవనాలను గుర్తించాలని ఆదేశించారు. నగరంలోని ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. వసూళ్లలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు లక్ష్యాలను నిర్దేశించాలన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పన్నులను ఏళ్లుగా చెల్లించని వారిని గుర్తించాలని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. ఇరుకైన సందుల్లో పారిశుధ్య పనుల పరిశీలన నిమిత్తం బైక్‌పై ఆయన పర్యటించారు. కుక్కలగుంటలోని వెహికల్ షెడ్‌ను తనిఖీ చేసి చెత్త తరలింపు వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. వాహనాల రిపేర్లు, చెత్త సేకరణ పాయింట్లు, చెత్త తరలింపు జరిగే ప్రక్రియను ఆరాతీశారు. బారకాస్‌లోని చేపలు, మటన్ మార్కెట్లలో విద్యుత్, కాలువ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని హెడ్ వాటర్ వర్క్స్ కేంద్రాన్ని పరిశీలించి.. తాగునీటి సరఫరా, నీటి నాణ్యత పరీక్షల అంశాలను ఆరాతీశారు. వీధి కుక్కల శస్త్రచికిత్స కేంద్రాన్ని తనిఖీ చేసి.. వీటి నియంత్రణకు చేపడుతున్న చర్యలపై వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాగుంట లేఅవుట్లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఎంహెచ్‌ఓ చైతన్య, ఈఈ చంద్రయ్య, డీఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ పరికరాలను తప్పక ధరించాలి

క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులు రక్షణ ఉపకరణాలను తప్పక ధరించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాధికారులు, సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి డివిజన్లో ఉదయం 5.30కు కార్మికుల మస్టర్‌ను పూర్తి చేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు కేటాయించిన యూనిఫారం, గ్లౌజ్, ఆప్రాన్, చెప్పులు, అవసరమైన పరికరాలను పని ప్రదేశాల్లో తప్పక వినియోగించేలా చూడాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలు, ప్లాట్ల యజమానులను సంప్రదించి, వారి ప్రాంగణాలను స్వచ్ఛందంగా శుభ్రం చేసేలా చూడాలని సూచించారు. ఖాళీ స్థలాలను గుర్తించి గ్యాంగ్ వర్క్ ద్వారా జేసీబీల సాయంతో పారిశుధ్య పనులు చేపట్టాలని చెప్పారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, హెల్త్ ఆఫీసర్ చైతన్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ జిజియా బాయి తదితరులు పాల్గొన్నారు.


విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి సమావేశం



నెల్లూరు(బృందావనం): నగరంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి పిలుపునిచ్చింది. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమావేశాన్ని నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఉత్సవాలను సెప్టెంబర్ ఏడు నుంచి నిర్వహించాలని తీర్మానించారు. గణనాథుడి నిమజ్జనాన్ని సెప్టెంబర్ 11న స్వర్ణాల చెరువు సమీపంలోని గణేశ్ ఘాట్ వద్ద నిర్వహించనున్నామని చెప్పారు. నగరంలోని వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశాన్ని ఆగస్టు నాలుగున నిర్వహించనున్నామని వివరించారు. సమితి గౌరవాధ్యక్షుడు బయ్యా వాసు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, రాళ్లబండి నవీన్, కొండపల్లి శ్రీకాంత్, మండ్ల ఈశ్వరయ్య, మోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, గజరా నరేష్, రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఏమరుపాటుగా ఉంటే అంతే..





• రోడ్లు, డివైడర్ల అంచున పేరుకుపోతున్న మట్టి

నెల్లూరు(బారకాసు): మైపాడు రోడ్డు, డివైడర్ల అంచున మట్టి పేరుకుపోతోంది. దీన్ని శుభ్రం చేయడంలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ద్విచక్రవాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉంది. మరోవైపు ఓ మోస్తరు గాలి వీచినా మట్టి లేచి వాహనదారుల కళ్లలో పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి మట్టిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాగు హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సత్యవాణి

నెల్లూరు సిటీ: సాగు హక్కు చట్టంపై కౌలు రైతులకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. దేవరపాళెంలో రైతులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సొంతంగా పొలం లేని రైతులు ఈ చట్టం ద్వారా పంట రుణాలు, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర సదుపాయాలను పొందవచ్చని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి పంట సాగు హక్కు పత్రం కోసం నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలను అందజేశారు. ములుమూడిలోని వరి పొలాలను పరిశీలించారు. సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, గ్రామ ఉద్యాన సహాయకుడు విష్ణు, గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో ఎంపీ భేటీ



నెల్లూరు (దర్గామిట్ట): కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను ఢిల్లీలోని ఆయన చాంబర్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. జిల్లా పరిధిలోని పోర్టుల స్థితిగతులపై చర్చించారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు



• కమిషనర్ సూర్యతేజను డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, 8, 46, 47, 50వ డివిజన్ల కార్పొరేటర్లు కామాక్షిదేవి, వేలూరు మహేష్, పొట్లూరి రామకృష్ణ, గుంజి జయలక్ష్మి కలిశారు.

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజను 13, 14, 16వ డివిజన్లకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, ఊటుకూరు నాగార్జున మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని కోరారు.

• మేయర్ స్రవంతిని కమిషనర్ సూర్యతేజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం



సీపీఎం నేతల ధర్నా

నెల్లూరు సిటీ: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు ఆరోపించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని సీపీఎం రూరల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీల ప్రస్తావన లేకపోవడం దారుణమని చెప్పారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లను రుణ సంస్థల ద్వారా ఇప్పిస్తామని ప్రకటించి తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించనున్నారని ఆరోపించారు. నేతలు కృష్ణయ్య, కిన్నెరకుమార్, కొండా ప్రసాద్, సంపత్‌కుమార్, సుధాకర్, శ్రీనివాసులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించరూ..



డీఈఓకు వినతిపత్రమిస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు కోరారు. నగరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈఓ రామారావుకు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల్లోనే విద్యను కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియాన్ని పునరుద్ధరించాలన్నారు. ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు సురేంద్రబాబు, ఖాజావలీ, దయాకర్, నేతలు రియాజ్ అహ్మద్, సుబ్రహ్మణ్యం తదితరులు పార్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నియంత్రణ



చేపలను వదులుతున్న పెంచలయ్య తదితరులు

నెల్లూరు(అర్బన్): నీరు నిల్వ ఉన్న గుంతల్లో దోమలార్వాలను తినేందుకు గంబూసియా చేపలను వదలాలని, దీని ద్వారా దోమలను నియంత్రించొచ్చని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. మూలాపేటలోని శివాలయ కోనేరు సమీపంలో గల కాలువలు, నీటి గుంతల్లోగంబూసియా చేప పిల్లలను జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మతో కలిసి పెంచలయ్య గురువారం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని, ఈ క్రమంలో ముందుజాగ్రత్తగా నీటి గుంతల్లో గంబూసియా చేపలను వదులుతున్నామని చెప్పారు. సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, జయరామ్, శ్యామ్‌సన్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని యూకో ఫీడర్లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శుక్రవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్థసారథి నగర్, యూకోనగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

దిష్టిబొమ్మ దహనం

నెల్లూరు సిటీ: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణకు చెందిన కదిరి కృష్ణ దిష్టిబొమ్మను నగరంలోని రాజేంద్రనగర్‌లో గురువారం దహనం చేశారు. క్షమాపణలను వెంటనే చెప్పాలని డిమాండ్ చేశారు. కీపూడి బాబు, కార్తీక్, నాగేంద్ర, చెంగయ్య, సుమన్, పెంచలయ్య, కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు(బృందావనం): నాలుగో మైలు సమీపంలోని నేతాజీ వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని ప్రశాంత్ మెమోరియల్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తన సోదరుడు ప్రశాంత్ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకురాలు రమాదేవి తెలిపారు. జయప్రకాష్, గిరీంద్ర, మహదేవ్, ఈశ్వర్, ఉమర్, కీర్తన, అబ్దుల్, సుమంత్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ఎలక్ట్రిసిటీ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నెల్లూరు టౌన్ డివిజన్ కార్యవర్గ సమావేశాన్ని కోటమిట్టలోని ఏఆర్పీ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, డీఈఈ అల్తాఫ్ హాజరయ్యారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు డివిజన్ ప్రెసిడెంట్‌గా షాహిద్, సెక్రటరీగా అబ్దుల్ ఖయ్యూం, జాయింట్ సెక్రటరీగా నూరిన్, వైస్ ప్రెసిడెంట్ గా షానవాజ్, ట్రెజరర్‌గా లతీఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సెక్రటరీ నవాజ్‌జానీ, రీజినల్ సెక్రటరీ సయ్యద్ రఫీ, కోటమిట్ట ఏఈ నస్రూల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



నెల్లూరు సిటీ: నగరంలోని అనిత హాల్లో కార్గిల్ విజయ్ దివస్‌ను బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుద్ధంలో పాల్గొన్న సైనికులను సత్కరించారు. ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ శ్యామ్‌ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మాచిరాజు వెంకటేష్, సాయికృష్ణయాదవ్, జిల్లా కార్యదర్శి కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.